ఓటేద్దాం.. పదండి

- పోలింగ్‌కు వేళాయే!
- మెదక్ పార్లమెంట్ పరిధిలో 2124 పోలింగ్ స్టేషన్లు
- 18,28,210 మంది ఓటర్లు
- 2336 మంది పీవోలు, 2336 మంది ఏపీవోలు
- ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో పోలింగ్ స్టేషన్లకు చేరుకున్న సిబ్బంది
- దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు
- అందుబాటులో బీఎల్‌వోలు, ఆశవర్కర్లు, వైద్య బృందాలు
- పోలింగ్ పారదర్శకంగా జరగాలి
- జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్
- ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ పరిశీలన

ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 12 (నమస్తే తెలంగాణ): మెదక్ పార్లమెంట్ పరిధిలో పోలింగ్‌కు యంత్రంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. మెదక్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 18,28,210 మంది ఓటర్లున్నారు. ఇందులో 9,25,891 మంది మహిళలు, 8,92,656 మంది పురుషులు, ఇతరులు 209 మంది ఉన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మెదక్ ఎంపీ స్థానానికి 44 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రానికి 3 ఈవీఎంలు, ఒక వీవీ పాట్, ఒక కంట్రోల్ యూనిట్‌ను తరలించారు.

మెదక్ పరిధిలో 2124 పోలింగ్ కేంద్రాలు

మెదక్ పార్లమెంట్ పరిధిలో ఏడు సెగ్మెంట్లున్నాయి. మెదక్‌లో 277 పోలింగ్ కేంద్రాలు, నర్సాపూర్ 307, సిద్దిపేట 273, దుబ్బాక 253, గజ్వేల్ 322, సంగారెడ్డి 281, పటాన్‌చెరు 411 మొత్తం 2124 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణకు 2336 మంది పీవోలు, 2336 మంది ఏపీవోలు, 4672 వోపీవోలు, 166 మంది మైక్రో అబ్జర్వర్లు, 214 మంది సెక్టార్ ఆఫీసర్లు, 2124 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేశారు. 7,961 బ్యాలెట్ యూనిట్లు, 2,652 కంట్రోల్ యూనిట్లు, 2,970 వీవీ ప్యాట్లు ఉన్నాయి.

దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు

దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. వీల్‌చైర్లు, ర్యాంపులు నిర్మించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ సిద్ధం చేశారు. ఆశవర్కర్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ పోన్ అనుమతి లేదన్నారు.

ఓటింగ్ సమాచారం అందించాలి: జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్

పోలింగ్ పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు. ఆదివారం మెదక్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మెదక్ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ చేపట్టాలన్నారు. ఈవీఎంలకు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైతే సెక్టార్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు నివేదించాలన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత నిబంధనల మేరకు సీల్ వేసి రిసెప్షన్ కేంద్రాల్లో అప్పగించాలని సూచించారు. పంపిణీ కేంద్రం నుంచి అధికారులు 277 పోలింగ్ కేంద్రాల్లో 28 రూట్లలో 61 బస్సుల్లో 1280 మంది సిబ్బంది పోలింగ్ సామగ్రితో తరలివెళ్లారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సమాచారం త్వరితగతిన అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ సిబ్బందికి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం సిబ్బందితో మాట్లాడారు. సోమవారం పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం, ఓటర్ల హాజరు సమాచారం త్వరితగతిన ఉన్నతస్థాయి అధికారులకు అందించాలన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి ఓటర్ల హాజరు, పోలింగ్ శాతం, పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ రాజేశ్, డీఈవో రాధాకృష్ణ, ఏవో యునాస్, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, ఈడీఎం సందీప్ పాల్గొన్నారు.

మెదక్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్లతో పోలింగ్ స్టేషన్‌కు బయలుదేరుతున్న సిబ్బంది

మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

నర్సాపూర్: బీవీఆర్ఐటీ కళాశాలలో ఎన్నికల సామగ్రితో సిబ్బంది

చేగుంట: వడియారంలో సిబ్బందికి సూచనలిస్తున్న గియానిస్సాబేగం

రామాయంపేటలో బూత్‌లో సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది

తూప్రాన్: కోనాయిపల్లి పీబీలో ఎన్నికలకు సిబ్బంది సమాయత్తం

రామాయంపేటలో ముస్తాబైన పోలింగ్ బూత్‌లు

శివ్వంపేటలోని పోలింగ్ సెంటర్లకు చేరుకుంటున్న ఎన్నికల సిబ్బంది

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

చిలిపిచెడ్: చిట్కుల్‌లో వర్షానికి తడుస్తున్న రోడ్డుపై తూకం వేసిన ధాన్యం

చిలిపిచెడ్, మే 12: ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చిలిపిచెడ్ మండలంలో ఎండకు ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. చేతికొచ్చిన ధాన్యం నీటిపాలవ్వడంతో నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించక వర్షం బారినుంచి కాపాడలేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడుస్తున్నదని వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనాలని రైతులు కోరుతున్నారు.

పిడుగు పాటుకు తాతా మనుమడు మృతి

వరి కుప్పలపై టార్పాలిన్లు కప్పడానికి వెళ్లి ఇద్దరు మృతి

పిడుగు పాటుతో మృతి చెందిన తాతా మనుమడు శ్రీరాములు, శివరాజ్

పెద్దశంకరంపేట, మే 12: పిడుగు పాటుకు ఇద్దరు మృతి చెందిన ఘటన పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే పెద్దశంకరంపేట మండలంలోని రామోజిపల్లి గ్రామానికి చెందిన పాల్వంచ శ్రీరాములు (45) తనకున్న రెండెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అందులో పండిన పంటను గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించేందుకు కేంద్రానికి తీసుకెళ్లాడు. తేమ శాతం ఎక్కువగా ఉండడంతో కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం ఆరబోశారు. ఆదివారం ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షం ఒక్కసారిగా భారీగా రావడంతో టార్పాలిన్లు కప్పడానికి శ్రీరాములు అన్న బిడ్డ కొడుకు (మనుమడు) శివరాజ్ (13)ను వెంట బెట్టుకుని వెళ్లాడు. ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న సమయంలో పిడుగు పడడంతో ఇద్దరు మృతిచెందారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శివరాజ్ పెద్దశంకరంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తాతా మనుమడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఆర్ఐ శరణప్ప ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. ఇక్కడ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బాసాడ రాజు, నాయకులు సురేశ్‌గౌడ్, సాయిలు వచ్చి బాధిత కుటుంబీకులకు సంతాపం తెలిపారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. పెద్దశంకరంపేట మండలం రామోజీపల్లిలో మృతిచెందిన రైతు కుటుంబానికి ప్రభుత్వం తరపున రావాల్సిన సహకారాన్ని అతి త్వరలో అందిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పాముకాటుతో వ్యక్తి మృతి

జంగం దుర్గయ్య (ఫైల్)

నర్సాపూర్, మే 12: పాముకాటుతో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకా రం.. కౌడిపల్లి మండలంలోని కూకుట్లపల్లి గ్రామానికి చెందిన జంగం దుర్గయ్య(60) శనివారం రాత్రి భోజనం చేసి నిద్రించడానికి బంగ్లాపైకి వెళ్లాడు. బంగ్లాపై నిద్రిస్తున్న సమయంలో పాము కాటు వేసింది. విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

పెద్దశంకరంపేట, మే 12: పెద్దశంకరంపేట లోని బెల్ట్ షాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మున్నూరు చందన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. రూ.20 వేల విలువ చేసే మద్యం సీసాలను ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

వెంకట్రామిరెడ్డి గెలువాలని ప్రత్యేక పూజలు

చేగుంట, మే 12: మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ ఇబ్రహీంపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త, బీఆర్ఎస్ నాయకుడు కిషన్‌రావుదేశ్‌ముఖ్ ఆదివారంప్రత్యేక పూజలు చేశారు. పూజలో తాజా మాజీ సర్పంచ్ దోరగొల్ల రాములు, రాజు, భిక్షపతి, పోచయ్య, మల్లేశం, అర్చకులు పాల్గొన్నారు.

మాసాయిపేటలో రూ.88లక్షలు పట్టివేత

చేగుంట పోలీసు స్టేషన్ పరిధిలోని మాసాయిపేట వద్ద నగదు పట్టుకున్న పోలీసులు

చేగుంట, మే 12: మాసాయిపేట మండలంలోని పోతాన్‌పల్లి చౌరస్తా వద్ద పోలీసులు డబ్బులు పట్టుకున్న ఘటన చేగుంట పోలీసు స్టేషన్‌లో పరిధిలో ఆదివారం జరిగింది. అర్ధరాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రామాయంపేట సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్ద శివునూర్ గ్రామ శివారులోని ఓ గెస్ట్ హౌస్ సమీపం నుంచి వస్తున్న కారును చేగుంట ఎస్సై బాలరాజు, తన సిబ్బందితో తనిఖీ చేయగా, ఎలాంటి పత్రాలు లేని రూ.88 లక్షల 43వేలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. చేగుంటకు చెందిన అన్నం రవి, పుల్లబోయిన రవిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సల్లంగ చూడమ్మ వనదుర్గమ్మ

- భక్తులతో కిక్కిరిసిన ఏడుపాయల


పూజలు అందుకుంటున్న దుర్గామాత

పాపన్నపేట, మే 12: ఏడుపాయల వనదుర్గా భవానీ మాతను ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నదిలోని పాయల్లో పుణ్యస్నానాలు చేసి దుర్గమాతకును మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, బోనాలు, తలనీలాలు సమర్పించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ సాత్తెల్లి బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తోట నర్సింలు, వరుణాచారి, బత్తిన రాజు, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లుచేశారు. వేద పండితులు శంకరశర్మ, పార్థివశర్మ, మురళీధర్, రాజశేఖర్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పాపన్నపేట ఎస్సై నరేశ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

క్యూలైన్‌లో భక్తుల సందడి

ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత

- 1309 మంది బలగాలతో బందోబస్తు
- ఓటు హక్కు వినియోగించుకోవాలి
- ఎస్పీ బాలస్వామి

పోలింగ్ స్టేషన్లను సందర్శిస్తున్న ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 12: స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాయ్స్ జూనియర్ కళాశాల, నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లాలో 1309 మంది జిల్లా, రాష్ట్ర, కేంద్ర బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మండలానికి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారితో ప్రత్యేక పెట్రోలింగ్, 78 రట్ మొబైల్స్, 21 క్విక్ రియాక్షన్ టీమ్స్, స్టాటిక్ ఫోర్స్, అబ్జర్వేషన్ టీమ్స్‌లతో భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని పోలింగ్ స్టేషన్లు 770, లొకేషన్స్ 530, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలు 127 ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు 6 నమోదయ్యాయన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలన

చిన్నశంకరంపేట, మే 12: చిన్నశంకరంపేట, గవ్వలపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ఆదివారం రాత్రి పరిశీలించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయనతో చిన్నశంకరంపేట ఎస్సై నారాయణ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్డు, SBI దగ్గర, 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. సంప్ర: 8143366630, 9989554915.
NT-5278

CHANGE OF NAME

★I, Kaneez Fathima, R/o. H.No. 12-4-88/1, Naseernagar, Siddipet Town & (Urban) Mandal, Siddipet District, Telangana. I have changed my Daughter's name from **ARWA** (old name) to **ARWA HAFSA** (new name)
NT-319515

RECRUITMENT

★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

బెట్టింగ్‌కు బానిసై.. తండ్రి చేతిలో హతమై

చిన్నశంకరంపేట, మే 12: బెట్టింగ్‌కు బానిసైన కుమారుడిని ఇనుప రాడ్డుతో తండ్రి కొట్టి చంపిన ఘటన చిన్నశంకరంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని భాగీర్థిపల్లిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. రామాయంపేట సీఐ వెంకటేశ్ కథనం ప్రకారం.. భాగీర్థిపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ వృత్తిరీత్యా రైల్వే ఉద్యోగి. అతడి కుమారుడు ముఖేశ్‌కుమార్ ఎలాంటి పని చేయకుండా తిరుగుతున్నాడు. దీంతో సత్యనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని రైల్వే ఉద్యోగాన్ని కుమారుడికి ఇప్పించాడు. ముఖేశ్‌కుమార్ వడియారం రైల్వే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతడికి భార్య రజిత, నాలుగేండ్ల కూతురు ఉంది. భార్య గర్భిణి. పురుడు కోసం వాళ్లమ్మగారింటికి వెళ్లింది. కొంతకాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడిన ముఖేశ్‌కుమార్ సుమారు రూ.2 కోట్లకు పైగా డబ్బులు పోగొట్టుకున్నాడు. చేసిన అప్పులు తీర్చడానికి మేడ్చల్‌లోని ఒక ఇల్లు, రెండు ప్లాట్లు అమ్మేశాడు. అయినా అప్పులు తీరలేదు. దీంతో మరో ఇంటిని అమ్మడానికి సిద్ధమయ్యాడు. గ్రామ పెద్ద మనుషులు, కుటుంబ సభ్యులు పలుమార్లు మందలించినా ముఖేశ్‌కుమార్‌లో మార్పురాలేదు. శనివారం రాత్రి మరో ఇల్లు అమ్ముతానని తండ్రితో వాగ్వాదానికి దిగాడు. కుమారుడిలో మార్పు రాకపోవడంతో విసిగిపోయిన తండ్రి సత్యనారాయణ, కుమారుడు నిద్రించాక ఇనుప రాడ్డుతో తలపై బలంగా కొట్టాడు. దీంతో కొడుకు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం సభ్యులు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657